★ ఎప్పటికో జ్ఞానోదయం... !

● శ్రీ కనుపర్తి వరలక్ష్మమ్మ

"మనకు నూరు ధర్మోపదేశాలుచేసి, తనకు వ్రేళ్ల ఉంగరాలు, తనభార్యకు కంఠహారములు అర్థించే గురువు యేమాత్రపు వేదాంతో విచారించాలె. స్త్రీలు గురువుయొక్క నైతికనిష్ఠను తెలుసుకోకుండా వారిమాటలచే వంచితులు కాకూడదు మోక్షం ఆడంబరాలలో లేదు; మూఢత్వానికిలేదు."

దాదాపు రాత్రి యెనిమిదిగంటలవఱకు ఎక్కడనో ఉగాదిపండువు వినోద కాలక్షేపాలతో ప్రొద్దుపుచ్చి అప్పుడే యింటికి చేరుకున్నాడు రాఘవరావు. రాజేశ్వరికూడా పిల్లల్ని వెంటబెట్టుకొని అప్పుడే యింటికి వచ్చింది. రాఘవరావు ఆమెనుచూచి నవ్వుతూ,

'సంవత్సరాది పండుగనాడు ఏపనిచేస్తే అదే ఏడాదిపొడుగునా వెంటాడుతుందంటారు. ఇక ప్రతిరోజూ నీవు యింటికివచ్చేవేళ యిదే అవుతుందేమో కొంచెం పెందలాడే యింటికి రాకపోయినావా?' అన్నాడు.

పెనిమిటి మాటలకు రాజేశ్వరి వెన్నెలవిరిసినట్లు కిలకిలానవ్వుతూ 'పైకి సంస్కర్తలవలె మాట్లాడుతూ ఉంటారుగాని, ముసలమ్మలచేదస్తపు మాటలమీద మీకుగూడా వల్లమాలిన నమ్మకమున్నదే' అన్నది.

'అవును. ఇవి ఉగ్గుపాలతో రంగరించి పెట్టినవిగాని సామాన్యమైనవా? మహా నాగరికమైన పాశ్చాత్య ఖండాల్లోనే నల్లపిల్లి శకునాలు పోలేదు, ఇక మనదేశంలోనా? అయితే యెక్కడనుంచి రావడము' అన్నాడు రాఘవరావు.

'మంగళకరమైన సంవత్సరాది పండువుగదా ఒక్కమాటు భగవద్దర్శనం చేసుకుందామని దేవాలయానికి వెళ్లాను. కాని యేంప్రయోజనం?

"ఏమి? భగవద్దర్శనంకాలేదా? ఎడంచేతిలో డబ్బులపళ్లెము, కుడిచేతిలో శఠగోపురము పట్టుకొని అర్చకుడు అప్పలాచార్యులు వచ్చినవారికందఱికీ భగవద్దర్శనము చేయించడానికి సిద్ధంగానే ఉంటాడుగా"

"లోపలిదాకా వెళ్లగలిగితే భగవద్దర్శనం చేయించడానికి ఒకరు కావాలా?'

'అయితే వెళ్లలేదు?'

'గుడి ఆవరణమంతా జనమే, ఎట్లావెళ్లేది?'

'నీవలెనే పండుగ పుణ్యకాలమందు భగవంతుని సేవించవలెనని వారందఱికీ తలంపు కలిగింది కాబోలు.'

'అయితే నయమే.'

'మఱెందుకు మూగారు? ఏదైన ఉత్సవమా?'

'హరికథ చెప్పుచున్నారు.'

'పోనీ అదే కాలక్షేపువిని రాకపోయినావా? అది మాత్రము పుణ్యము తక్కువగా యిస్తుందా? ఈ కాలంలో భజనలు, పురాణాలు, హరికథలూ అంటే మఱీ అరచేతిలో వైకుంఠము చూపేవేగదా.'

'అదైనా వినని స్తేగదా.'

‘ఎవరు విననివ్వలేదంటావు?’

‘ఒకరని పేరేమిటి. అందరూ అందులో భాగస్థులే. మాటలు చెప్పుకునే ఆడవాళ్లూ, మందలించే మగవాళ్లూ, గంతులుపెట్టే పిల్లలు, పాలకేడ్చేపసిబిడ్డలు, నామసంకీర్తనలు చేయించే హరికథకుడు అందరూ ఆ చప్పుడుకు .కారణభూతులే. అయితేనేమి ? ప్రతి ఒక్కరికీ తాము యితరులను “ఊరుకోండమ్మా ఇంటి ముచ్చటలన్నీ యిక్కడనేటమ్మా” అని మందలించడము గూడా ఆ విపరీతశబ్దానికి కారణమౌతుందని తెలియదు. ఇతరులందరూ అజాగ్రత్తగా అప్రస్తుత సంభాషణలుచేస్తున్నట్టు తాము మాత్రము శ్రద్ధగా మౌనంగా కూర్చుని వినదలచిన వారైనట్టూ భావించుకొని ప్రక్కవారిని మందలిస్తూ ఉంటారు. అదే పది మంది అనడంతో పెద్దధ్వని బయలుదేరుతుంది. అసలు కథ ఆగందరగోళంలో లీనమైపోతుంది.’

‘నిజమే ఏదైనా ఒక ఉపన్యాసంగాని, పురాణంగాని హరికథగాని, వినడానికి వెళ్లేవాళ్లు ఒకరిని మందలించడానికైనా మాట్లాడమని యింటివద్దనే శపథంచేసుకొని వెళ్లితే బాగా ఉంటుంది. అయినా మీ ఆడవాళ్లు చేరినచోట సద్దులేకుండా ఉండదులే. మా పురుషులసభైతేనా ? ఎంత నిశ్శబ్దంగా ఉంటుంది. చీమ చిటుక్కుమంటే వినబడేటట్లుంటుంది.’ -

‘అవును లెండి మేమూ నిక్కచ్చిగా ఒక్కొక్కరమే వెళ్లితే మాసభమాత్రం ముచ్చటగా ఉండ కేమి? మీలో ప్రతి ఒక్కరూ పసిబిడ్డలను మాకు వదలి, ఒక్కొక్కయెడ బిడ్డను వెంటబెట్టుకొని ఒకమాటు ఒక సమావేశానికి హాజరై చూడండి, మీ సమావేశ మెంత ముచ్చటగా ఉంటుందో.’

‘నీకు మా ఆడవాళ్లనంటే ఊరికే కోపపడతావుగాని, నిజానికి మా మాటలకు పిల్లలొక్కరేనా కారణం? నిజం చెప్పు. ఇవాళ పండుగ కావడంచేత ఎంతప్రొద్దువేళ లేచారో, ఏయేపనులు చేశారో, ఎన్నెన్ని పిండివంటలు వండారో, చీరలేమికొన్నారో, రవికలేమి కుట్టించుకున్నారో, నగలేమి పెట్టు కున్నారో, పెనిమిటేమి కోపబడ్డాడో, పిల్లలేమి పేచీలుపెట్టారో, అన్నీ అక్కడ వెళ్లబోసుకోవలసిందే గదా. అందువల్లనే యివ్వాళ మరీ మాటలసందడి యెక్కువై ఉండాలె. నూరుమంది కూడనీ, నిజానికి మాకీ మాటలుంటాయా?’

‘నిజానికి మీరు చేసిందేమీ ఉండదుగా’ అన్నది వెంటనే రాజేశ్వరి. రాఘవరావు పక్కున నవ్వాడు.

‘ఇంతకు మావాళ్లకు మతిలేదు. ఈ స్త్రీలవల్లనే సందడి, అల్లరి, గొడవ అని మగవారంతా ఒక్క విధంగా ఆక్షేపిస్తూఉంటే, వీళ్లు ఆ సమావేశాలకు పోకుండా ఉండరాదూ? మాయ పుణ్యాపేక్ష వీళ్లను ఊరుకు లెత్తింస్తుందాయెను.’

‘పుణ్యాపేక్షణకు, దయాసత్యశౌచాదులకంటె, నిరుపమాన సాధ్వీధర్మంకంటె, అతిథి అభ్యాగతి పూజకంటె, భగవదారాధనకంటె, భర్తృశుశ్రూషకంటె, బిడ్డలసేవకంటె ఈ హరికథలు యెక్కువ పుణ్య మిస్తాయా ? ఆ హరికథకుడు తానేదో పరమభాగవతశిఖామణి అయినట్టూ తాను కాస్తంత భగవన్నామం ఆవినవచ్చిన వారిచే చేయిస్తేనే తానూ వారూ స్వర్గానికి సోపానాలు కట్టుతామన్నట్టూ, తనకేమీ యీహ లేనట్టూ మాట్లాడుతూనే ఆడవారి జడలో స్ఫూదులు, సిగలో పూవులు, చెవులనూగే లోలకులు, పైకిపోయిన రవికలూ వర్ణిస్తూ ఉంటాడు. ఆ పరమభాగవతుడిట్లా పరిహసిస్తూఉంటే మా ఆడవాళ్లంతా బిడియం లేకుండా తమ్మునుగాదన్నట్టూ, ఆ ఆక్షేపణలకుగురి అయిన స్త్రీజాతి వేరే యెక్కడో తమకు సంబంధం లేకుండా ఉన్నట్టూ, తాముమాత్రం ఉన్నతోన్నత ఉత్తమశ్రేణికి జెందిన స్త్రీలైనట్టు, విని ఆనందిస్తూ ఉంటారు.’

'నిజమే యీ పురాణాలు పుణ్యకథలు చెప్పే వారికి స్త్రీల నాక్షేపించడం మహాజాస్తి. నాకే అధికారముంటే యీ హరిదాసులు యిటువంటి అప్రస్తుతప్రసంగాలు చేయకుండా...'

'అవును, హరికథకులను శిక్షిస్తావు. అంతే మీ ఆడవాళ్లను మాత్రము పోకుండా ఆపలేవు. ఈ దండన ఎట్లా ఉన్నదంటే, మిఠాయి, కొనుక్కోకుండా మా అబ్బాయిని మేము ఆపలేము. ఊళ్లో మిఠాయి అమ్మకం జరగకుండా దుకాణాలను కట్టిపెట్టించమన్నట్లున్నది. అసలు ఈ హరికథలకు పురాణాలకు పోషకులు మీ స్త్రీలే. మీరు బాయికాట్ చేస్తే, నీరుపెట్టడం మానితే చేను యెండినట్టుగా, ఈ కాలక్షేపాలన్నీ వాటంతట అవే సన్నగిలి ఊరుకుంటాయి. కాని మీ స్త్రీలు జరిపే సమావేశాలకన్నా వీటికే అధికంగా మూగుతూ ఉంటారు. ఏ వెట్టి పుల్లయ్య చెప్పినమాటలను శిరసావహిస్తూ ఉంటారు. అన్నట్టు యివ్వాళ మీ సమాజంలో సంవత్సరాది సమావేశం జరిపారుకదా ఏమాత్రం స్త్రీలు వచ్చారు?'

'పాతికమందో...ముప్పైమందో...'

'మరి హరికథవద్దనో కొన్ని వందలమంది ఉండి 'ఉంటారుగాదూ.'

'ఉన్నారు.'

'స్త్రీలచే స్థాపింపబడి, స్త్రీల అభ్యుదయము నిమిత్తము స్త్రీలచే నిర్వహింపబడుతూఉన్న స్త్రీ సమావేశాలకు వ్రేళ్లమీద లెక్కింపబడే మాత్రపు స్త్రీలు మాత్రమే రావడమూ, ఆ వెక్కిరికొక్కిరి కథలు చెప్పే పురాణాలకూ, హరికథలకూ స్త్రీలు తండోపతండాలుగా రావడమూ—తప్పు ఎవరిదంటావు?'

'పుణ్యం దప్ప మనుష్యులు మరి దేనిని ఆశించగూడదనీ, ఆపుణ్యము యిటువంటి పురాణాలు, హరికథలు, భజనలు, వేదాంత విచారణలూ, గురు శుశ్రూషలు వగైరాలవల్లనే వస్తుందనీ నూరిపోసిన తప్పెవరిదో వారిదీ. అజ్ఞానులు అమాయకులు అవిద్యాంధకారమగ్నలూ అయిన వారిమాట యెందుకు? అన్ని విషయాలు చక్కగా తెలిసిన మీ పురుషులలో సైతము ఆ పురాణాలకు, పుణ్యకథలకు పంపినంత ధైర్యంగా తమ స్త్రీలను స్త్రీ సమాజాలకు పంపగలవారెందరున్నారో చెప్పండి? స్త్రీ సమాజాలకు తమ స్త్రీలు వెళ్లినట్లైతే వారిలో యే విజ్ఞానదీప్తి ప్రకాశిస్తుందో, ఏ స్వాతంత్ర్య కాంక్ష రేకెత్తుతుందో, ఏ సంఘీభావ మేర్పడుతుందో, అందువల్ల తమ స్వార్థానికేమి ముప్పవమోఅని వారికి భయం. అందువల్ల యే ప్రమాదమున్నా తమ ఆధిపత్యానికేమీ ముప్పముండదుగదా అని తమ స్త్రీల నిట్టి కాలక్షేపాలకు మగవారు పంపుతూ ఉంటారు. సనాతన సాంప్రదాయాలమీద ఉండే గౌరవమూ, పుణ్యంమీదఉండే అపేక్షా మావాళ్లకి అసత్యతను గోచరింపకుండా చేస్తున్నది. ఎప్పటికో జ్ఞానోదయం...!'అని నిట్టూర్పువిడిచింది రాజేశ్వరి.

క్షమార్పణ

దినమునకొక పూటయును గంజిలేమిచేఁ జిక్కి వెన్నంటిన డొక్కతోఁడ
కటితలంబెనియుఁ గప్పు చేలములేక విచ్ఛిద్రమా గోఁచి పేల్కతోఁడ
చలికి నెండకు నింత తలదాచుకొన నీడఁ గానక కృశియించు మేనితోఁడ
సంఘతృణీకృతజాతి హైన్యతఁగల్గు నిర్బంధబానిస వృత్తితోఁడ
సంఘ సేవయొనర్చు పంచమసహోదరా! యికన్మమ్ము క్షమియింప రాదటయ్యా!
నీయుసురుగొట్టియే కాదె నిశ్చయంబు హైందవావని పారతంత్ర్యమ్ము గుడుచు!

—శ్రీ కొండపల్లి సుభద్రాంబ.